పుడమి తల్లికి ఏరువాక పూజలు

- ఘనంగా ఏరువాక పున్నమి
- వ్యవసాయ పనులకు రైతుల శ్రీకారం

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీప్రాంతంలో ఏరువాక పున్నమి వేడుకలను బుధవారం రైతులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తన సొంత పొలంలో ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహించారు. పుడమి తల్లికి వ్యవసాయ పనిముట్లకు పూజలు చేసి హారతులిచ్చారు. అనంతరం ట్రాక్టర్లతో నాగలి దున్ని వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులు, వ్యవసాయాభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ముఖ్యంగా విత్తు నుంచి విత్తనం కొనుగోలు వరకూ రైతులు ఎటువంటి కష్టం పడకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని విధాలా అండగా నిలిచారన్నారు. పెట్టుబడి సాయం కింద నియోజకవర్గంలోని సుమారు 40570 మంది రైతులకు రైతు భరోసా పథకంలో సుమారు రూ.93.33 కోట్లు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అలాగే రైతులకు వ్యవసాయ పని ముట్లు, ట్రాక్టర్లు వంటివి వైఎస్ జగన్ అందించారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం రైతులను కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత ఏడాది రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లో ఎటువంటి పెట్టుబడిసాయం అందించలేదన్నారు. రైతులకు గ్రామంలోనే మెరుగైన సేవలు అందిస్తున్న రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏడాది కూటమి పాలన చూసిన రైతులు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలననే గుర్తు చేసుకుంటున్నారన్నారు.


చింతలపూడి: నాగలితో దుక్కి దున్నుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది


బుట్టాయగూడెం: ఏరువాక పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

ఏరువాక ప్రత్యేక పూజలు

చింతలపూడి: మండలంలోని యండపల్లి గ్రామంలో కిసాన్ అంగడి బయో రిసోర్స్ సెంటర్, జాయిన్ ఫర్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో బుధవారం ఏరువాక పున్నమి కార్యక్రమం నిర్వహించారు. కాడెద్దులు, నాగలికి రైతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ అంగడి వ్యవస్థాపకులు మరికంటి గోపాలకృష్ణ మాట్లాడుతూ వర్ష రుతువులో జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని రైతులు ఏరువాక పున్నమిగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. రైతులు ఇప్పుడు దేశీ వరి విత్తనాలతో, రసాయనాలు లేని పద్ధతుల్లో ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించడంపై దృష్టి పెట్టాలని, ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. నాలుగు మండలాల నుంచి వచ్చిన 20 మంది ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి ఎన్ఎఫ్ఏపీ హుస్సేన్, బి.నరసింహారావు, జి.ఫ్రాన్సిస్ పుల్లారావు, రైతులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రాల పరిధిలో బుధవారం ఏరువాక పున్నమి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. వేలం నిర్వహణాధికారులు జె.సురేంద్రకుమార్ ఆధ్వర్యంలో చల్లవారిగూడెంలో నిర్వహించగా, బి.శ్రీహరి ఆధ్వర్యంలో గుర్వాయిగూడెం గ్రామాల్లో నిర్వహించారు. చల్లవారిగూడెంలో రైతు సత్రం వెంకట్రావు పొలంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే గుర్వాయిగూడెంలో బాకి శ్రీనివాసరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నవధాన్యాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీవో, ఫీల్డ్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం: చల్లవారిగూడెంలో ఏరువాక పున్నమి నిర్వహిస్తున్న అధికారులు

క్లుప్తంగా

అమ్మవారికి పల్లకీ సేవ


విజయదుర్గమ్మకు పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మకు పౌర్ణమి తిథిని పురస్కరించుకొని పల్లకీసేవ నిర్వహించారు. సన్నాయి మేళ తాళాల నడుమ పట్టణ పురవీధుల్లో పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడ రామమోహనరావు ప్రధాన అర్చకులు సుదర్శనం వేణు గోపాలచార్యులు, ఆలయ శాశ్వత కమిటీ సహాయ కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు, ట్రెజరర్ మారిశెట్టి అంజన్ కుమార్, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గుడిమెట్ల యుగంధర్, ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యర్రం ఉదయ్ కుమార్, సభ్యులు వీరవల్లి శ్రీనివాసరావు, దూషణపూడి కొండబాబు, నిస్సాంకుల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మకు చండీహోమం


నూకాలమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న చండీహోమం

జంగారెడ్డిగూడెం: శ్రీనూకాలమ్మ దేవస్థానంలో 76వ చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ శాశ్వత చైర్మన్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ వర్షాలతో పాడి పంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ చండీహోమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ చండీహోమంలో ఉభయదారులుగా మద్దుల మోహన్ నవ్యశ్రీ దంపతులు (దొండపూడి), వంకాయల సూర్యనారాయణ, విజయేశ్వరి దంపతులు (తాడేపల్లిగూడెం), రావి రాఘవకుమార్, భవాని దంపతులు, స్థానిక రంగరాజు దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రొంగల నాగేశ్వరావు, సభ్యులు తిప్పాభట్ల రామకృష్ణ, పోలుపర్తి రాము, పీవీ కృష్ణారావు, గాలి నూకరాజు, దేవరకొండ దత్తు, నౌడు సత్య నూకరాజు, పసుమర్తి సత్తిరాజు, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం


శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కొయ్యలగూడెం: శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో శ్రీరామ పట్టాభిషేకం బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు గుడిపూడి శేషాచార్యులు శ్రీ సీతారామ లక్ష్మణ సమేత హనుమద్ ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆలయంలోని ఉపాలయ మందిరంలో శ్రీఅభయ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గత పదహారు రోజులుగా భక్తులు నిత్యం సుందరాకాండ పారాయణ నిర్వహిస్తున్నారు. దీనిని పురస్కరించుకొని ముగింపు సందర్భంగా శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపి దంపతులు, కొల్లూరి వీరభద్ర రావు దంపతులు చేత లక్ష తులసి పూజలు నిర్వహించారు.

అన్న ప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: హైస్కూల్ వద్ద ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అన్న ప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో తొలుత స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో 1400 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. చల్లా వరప్రసాద్, శీదరాల శ్రీనివాస వెంకట గంగాధర్, కోటగిరి లక్ష్మి ప్రసన్న, కానూరి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి కార్యాలయంపై దాడి అమానుషం

భీమడోలు: ఏలూరు సాక్షి కార్యాలయంపై దాడి చేయడం, సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్‌చేయడం అప్రజాస్వామ్యమని వైఎస్సార్‌సీపీ నేతలు ముక్త కంఠంతో ఖండించారు. కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగుతుందని, ఏడాదిపాలనలో వైఎస్సార్‌సీపీ వర్గీయులను టార్గెట్ చేస్తూ హత్యలు, అక్రమ అరెస్టులుచేయడం, ఆభంశుభం తెలియని బాలికలు, యువతులపై అత్యాచారాలు చేయడంతప్ప అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఏలూరు సాక్షి కార్యాలయంపై టీడీపీ గుండాలు దాడికి దిగడం, కేఎస్ఆర్‌కు సంబంధం లేని విషయంలో ఆయనను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. సాక్షిమీడియా నిజాలను నిర్భయంగా ప్రజల ముంగిట ఉంచుతున్నందున కూటమి సర్కార్ అక్కసు తట్టుకోలేక ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతుందన్నారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. సాక్షి మీడియాకు ప్రజా మద్దతు ఉంటుందని, తాము అండగా ఉంటామని మండల అధ్యక్షుడు రావిపాటి సత్య శ్రీనివాస్ తెలిపారు.

వ్యవసాయ కార్మికులకు చట్టాన్ని చేయాలి


జంగారెడ్డిగూడెం: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు



కొయ్యలగూడెం: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం: వ్యవసాయ కార్మికులకు కేంద్రం సమగ్ర చట్టాన్ని చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, దేశ వ్యాప్తంగా బుధవారం అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి, తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జేవీ రమణరాజు, సుంకర రాధాకృష్ణ (బాబు), బీకేఎంయూ నాయకులు గుదే ఆశీర్వాదం, నిట్టా రామారావు, మాంద్రు సాల్మేన్, కుంచె రాజశేఖర్, కుంచె మోహన్, కుంచే నాగేంద్ర, దొడ్డిగర్ల గాంధీ, తోట శిరీష, ధనవంత్రం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కొయ్యలగూడెం: వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ గిరిజన రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ నాయకులు కారం దారయ్య, కొయ్యలగూడెం సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చింతలపూడి దుర్గారావు, దుగ్గిరాల నారాయణరావు, సతీష్, వంక సత్తిబాబు, సత్యనారాయణ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

కొయ్యలగూడెం: సరిపల్లి పంచాయతీ పరిధిలో మండల పరిషత్ నిధుల ద్వారా అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు పంచాయతీరాజ్ ఏఈ సురేష్ బుధవారం పేర్కొన్నారు. ఎంపీపీ గంజిమాల రామారావు ఆధ్వర్యంలో రూ.2 లక్షలతో డ్రెయినేజీ, మరో రూ.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పూజలు నిర్వహించారన్నారు. బయ్యనగూడెం, సరిపెల్లి మీదుగా రేగులగుంట వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారిందని రహదారి అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజు, ఎంపీటీసీ బండి రత్నం, మాజీ ఎంపీటీసీ మట్టా సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.కోటేశ్వరరావు, డి.కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నేతలు

మట్టి అక్రమ తవ్వకాలు ఆపాలి

టి.నరసాపురం: మండలంలోని తిరుమలదేవీపేట పంచాయతీ ఎర్రకాలువ మిగులు భూముల్లో కొద్ది రోజులుగా అక్రమ తవ్వకాలు చేస్తున్నా అధికారులు, ఇరిగేషన్ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు విమర్శించారు. టి.నరసాపురం అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ నాయకులు మాట్లాడుతూ మిగులు భూముల్లో పేదలు, దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్నారన్నారు. కొద్ది రోజులుగా ఎటువంటి అనుమతులు లేకుండానే రాత్రిపూట మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్నారని తక్షణం వాటిని నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి సుధారాణి సిరివతుల సీతారామయ్య దుర్గమ్మ గాంధీ మడకం కుమారి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కొత్తూరులో తాగునీటి సమస్య

కొయ్యలగూడెం: తాగునీటి సమస్య పరిష్కరించాలని కొత్తూరు గ్రామస్తులు బుధవారం ఆందోళన నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామమైన కొత్తూరులో గత రెండు నెలల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వాటర్ ట్యాంక్ నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేసే పంపు డ్రైవర్ లేకపోవడం వలన సమస్య ఏర్పడిందన్నారు. గతంలో స్థానికులు రోజుకొకరు వంతుల వారీగా ట్యాంక్ వద్ద విధులు నిర్వహించేవారు. అయితే ఉపాధి పనులకు వెళుతుండడం, వ్యవసాయ పనులు ప్రారంభం అవుతుండడంతో కూలీనాలీ పనులు చేసుకునే తామంతా పొలం బాట, చెరువుల బాట పట్టాల్సి వచ్చిందన్నారు. దీంతో తాగునీటి సమస్య తలెత్తిందని సంబంధిత అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు. అదే విధంగా తాగునీటి పైపులకు ట్యాప్‌లు బిగించకపోవడం వలన కొత్తూరు ప్రాంతంలో నీరు వృథాగా పోతుందని దానిని అరికట్టాలని కోరుతున్నారు.


తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఆదర్శనీయులు కుమ్మర

బుట్టాయగూడెం: ఏజెన్సీ మారుమూల ప్రాంతం బుట్టాయగూడెం మండలం తాళ్ల కట్టుపల్లికి చెందిన కుమ్మర చిన్న వెంకటేశ్వరరావు కష్టాల కోర్చి గుండె వైద్యనిపుణులుగా రాణించి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. తెలుగు ఉపాధ్యాయుడు సూర్యనారాయణ ప్రోత్సాహంతో డాక్టర్ అవ్వాలనే లక్ష్యాన్ని చిన్నతనంలోనే ఎంచుకున్నారు. ఇంటర్ కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన ఆయన 1975లో హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలో ఎంబీబీఎస్‌లో చేరారు. గాంధీ వైద్య కళాశాలలో ఎంఎస్, నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో గుండె చికిత్స విద్యను అభ్యసించి కొంత కాలం మెడ్విన్ మెడిసిటీ ఆస్పత్రిలో గుండె శస్త్ర చికిత్స వైద్యుడిగా పనిచేశారు. 1997లో హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో గుండె వైద్య నిపుణులుగా సుమారు 25 వేల మందికి పైగా గుండె శస్త్రచికిత్సలు చేసి పేరు గడించారు. గిరిజన ప్రాంతం నుంచి వెళ్లిన సీనియర్ గుండె వైద్య నిపుణుడిగా గుర్తింపు పొందారు. ఆయన కుమార్తె సాయి హిమబిందు కూడా వైద్యురాలిగా ఉన్నారు.


చిన్న వెంకటేశ్వరరావు, గుండె వైద్యులు (ఫైల్)

నేడు, రేపు బస్‌పాస్ కౌంటర్లు పని చేయవు

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ మంజూరు చేస్తున్న బస్‌పాస్‌లు మార్పులు చేస్తున్నందున ఈ నెల 12, 13 తేదీల్లో కౌంటర్లు పని చేయవని డిపో మేనేజర్ గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ నుంచి యథావిధిగా బస్సు పాసులు ఇస్తామన్నారు. కావున విద్యార్థులు, పలు రకాల పాస్‌లు తీసుకునే వారు సహకరించాలని కోరారు. అలాగే విద్యార్థులు కొత్త సంవత్సరం కావున తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని కౌంటర్‌కు వచ్చినట్లయితే త్వరగా పాసులు తీసుకోవచ్చని డిపో మేనేజర్ తెలిపారు.

అంతర్జాతీయ ఆధ్యాత్మిక శాస్త్రవేత్తల సదస్సు

జంగారెడ్డిగూడెం: స్థానిక పిరమిడ్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు అంతర్జాతీయ ఆధ్యాత్మిక శాస్త్రవేత్తల సదస్సును నిర్వహిస్తున్నట్లు పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్షుడు కాకి రామకృష్ణ, కార్యదర్శి తటవర్తి కృష్ణ తెలిపారు. స్థానిక గౌరి సుభద్ర పిరమిడ్ ధ్యాన మందిరం అనుబంధ మైత్రేయ మందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రపంచ శాంతి, ఆధ్యాత్మిక దివ్య చైతన్యం, వ్యక్తిగత పురోగతి, తదితర అంశాలపై తొమ్మిది మంది విశిష్ట అతిథులు ప్రవచనం అందిస్తారన్నారు.

నూతన తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నజీ ముల్లాషాను స్వాగతిస్తున్న రెవెన్యూ సిబ్బంది

లింగపాలెం: మండల తహసీల్దార్‌గా నజీముల్లాషా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఏలూరు కలెక్టరేట్‌లో పని చేస్తూ ఇక్కడకు బదిలీపై నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్ పని చేశారు.

23న ఏఐయూకేఎస్ రాష్ట్ర మహాసభలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కే గౌస్

జంగారెడ్డిగూడెం: అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర మహాసభలు ఈ నెల 23వ తేదీన జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే గౌస్ తెలిపారు. చల్లవారిగూడెంలో ఏఐయూకేఎస్ ఆహ్వాన సంఘం నిర్మాణం కోసం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం కమిటీ సభ్యులు గడ్డల ముత్యాలరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ మూడు వ్యవసాయ నల్లచట్టాల రద్దు కోసం ఏఐయూకేఎస్ పోరాడిందన్నారు. నేటి వరకు చేస్తున్న అనేక పోరాటాలు, ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకొని నూతన కమిటీ నిర్మాణానికి జంగారెడ్డిగూడెంలో నిర్వహించే రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని వారు కోరారు.

తహసీల్దార్‌ది సాధారణ బదిలీ మాత్రమే

కొయ్యలగూడెం: మండల తహసీల్దార్ కె.చెల్లన్నదొర ట్రాన్స్‌ఫర్ విషయం సాధారణ బదిలీ ప్రక్రియలో భాగంగా నిర్వహించిందేనని కలెక్టరేట్ నుంచి సమాచారం అందింది. దీనిని ధ్రువీకరిస్తూ కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తహసీల్దార్ చెల్లన్న దొర బదిలీ విషయం వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో రాజకీయ ఒత్తిళ్లతో బదిలీ కాలేదన్నారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.నాగరాజు కూడా సాధారణ బదిలీల్లో భాగంగానే కొయ్యలగూడేనికి బదిలీ అయినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జంగారెడ్డిగూడెం: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటనపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు లక్కవరం ఎస్సై డి.శశాంక తెలిపారు. మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన మనెల్లి హనుమాన్ కుమార్‌తో మనీషా(29)కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. హనుమాన్ కుమార్ ఈ నెల 9వ తేదీ సోమవారం మనీషాను తిట్టడంతో మనస్థాపానికి గురైన మనీషా కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు రాజమండ్రిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మనీషా మంగళవారం మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి తండ్రి ఏసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లక్కవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మనీషా మృతదేహంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. భర్త, అతడి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో లక్కవరం ఎస్సై శశాంక, జంగారెడ్డిగూడెం సీఐ వి.కృష్ణబాబు ఆందోళనకారులతో చర్చలు నిర్వహిస్తున్నారు.


మనీషా మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

రేపు ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా

దెందులూరు: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఈ నెల 13న ఏలూరు విచ్చేస్తారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. బుధవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 13న ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తావమన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హాజరవుతారన్నారు. 9.30 గంటలకు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా బయలు దేరి కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.